సాక్షి తిరుపతి

శుక్రవారం, 13, జూన్, 2025



ఇదేనా సనాతన ధర్మం?

కూటమి ప్రభుత్వంలో ఆలయాలకు రక్షణ లేకుండా పోయిందని గురువారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విమర్శించారు. - 8లో



బలవంతపు బదిలీలు..!

కూటమి ప్రభుత్వంలో ఎస్జీటీ బదిలీలు ఇష్టానుసారంగా నిర్వహిస్తుండడంతో టీచర్లు మండిపడుతున్నారు. - 8లో



యువకుడి గల్లంతు

తెలుగు గంగ కాలువలో స్నానానికి దిగి గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

16 నుంచి 'స్టాప్ డయేరియా' ప్రచారం

తిరుపతి తుడా : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమానికి నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు 4.8 శాతం మరణాలకు డయేరియానే కారణంగా ఉందని చెప్పారు. విరేచనాల వల్ల కలిగే అన్ని రకాల మరణాలను ముందస్తుగా గుర్తించడం, ఓవర్ డీహైడ్రేషన్ సోల్యుషన్, జింక్ మాత్రలు తీసుకోవడం, ఆ సమయంలో పిల్లలకు పోషకాహారం వంటి విషయాలపై ప్రజలను చైతన్యం చేయనున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఓపెన్ స్కూల్స్‌లో పదో తరగతి, ఇంటర్‌లో చేరడానికి గురువారం నుంచి అడ్మిషన్లు ఇస్తున్నట్లు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పి.గురుస్వామిరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూలై 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అపరాధ రుసుము లేకుండా జూలై 31వ తేదీలోపు ఫీజు చెల్లించాలని తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఆగస్టు 1 నుంచి 15వ తేదీలోపు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను మీసేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసి ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

నిర్దేశిత సమయంలోనే అడ్మిషన్లు

తిరుపతి సిటీ: టీటీడీ విద్యా సంస్థల్లో నిర్దేశించిన సమయంలోనే అడ్మిషన్లు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. అటానమస్ హోదాలో అడ్మిషన్లు లేవనడం అవాస్తవమని, త్వరలో డిగ్రీ అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేయనుందని తెలిపారు. ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సుల్లో డ్యూయల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశ పెట్టనున్నట్లు వివరించారు.

ఓపెన్ స్కూల్ ఫలితాల వెల్లడి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు గురువారం వెలువడ్డాయి. పదో తరగతిలో 664 మంది పరీక్షలు రాయగా 538 (81.02 శాతం) మంది, ఇంటర్‌లో 1,137 మందికి గాను 808 (71.06 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పి.గురుస్వామిరెడ్డి తెలిపారు.

సమస్యలే పాఠాలు

పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కావడంతో ఎంతో ఉత్సాహంగా సర్కారు బడులకు వెళ్లిన విద్యార్థులకు నిరాశే ఎదురైంది. కొన్ని తరగతి గదుల్లో టీచర్ల ముఖం చూడకుండానే తొలిరోజు ఇంటిబాట పట్టాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని బడుల్లో విరిగిన తలుపులు, పనిచేయని ఆర్వోప్లాంట్లు విద్యార్థులకు స్వాగతం పలికాయి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ బడుల వైభవాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తలచుకోవడం కనిపించింది.





తిరుపతి ఎంజీఎం పాఠశాలలో కుర్చీలను, బల్లలను మోసుకెళ్తున్న విద్యార్థులు

- సమస్యల నడుమ పాఠశాలలు పునఃప్రారంభం
- విద్యార్థులకు శాపంగా కూటమి నిర్లక్ష్యం
- పత్తాలేని నూతన అడ్మిషన్లు
- అరకొరగా విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రభుత్వ పాఠశాలల్లోని అనేక సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలికాయి. పలుచోట్ల అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు, విరిగిన తలుపులు, కిటికీలు, ఊడిన బ్లాక్‌బోర్డులు, రెక్కలు లేని ఫ్యాన్లు, పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్లు, నాణ్యత లేని మధ్యాహ్న భోజనం, అపరిశుభ్రంగా పాఠశాలల ఆవరణం వంటి అనేక సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలికాయి. జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులే చీపుర్లు పట్టి తరగతి గదులను శుభ్రం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పలు పాఠశాలల్లో అటెండర్లు లేక హెచ్‌ఎంలు, టీచర్లే బడిగంట మోగించారు. జిల్లాలో తొలిరోజు సర్కారు బడుల నిర్వహణ తీరుపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

వేసవి సెలవుల అనంతరం జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. గత ఐదేళ్లల్లో వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో మెరుగైన సౌకర్యాలతో ఆహ్లాదకరంగా సాగిన చదువులు.. ప్రస్తుతం కూటమి పాలనలో నిర్వీర్యం అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు కొట్టొచ్చినట్లు కనిపించాయి. మరికొన్ని చోట్ల తరగతి గదులు, వంటశాలలు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ లేక మూతపడ్డాయి. విద్యామిత్ర కిట్లను అరకొరగా పంపిణీ చేసి మమ అనిపించారు.



ఎంజీఎంలో విద్యార్థి కిట్లను అందజేస్తున్న టీచర్లు

జాడేలేని కొత్త అడ్మిషన్లు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 మండలాల్లోని సర్కారు పాఠశాలల్లో తొలిరోజు నూతన ప్రవేశాల జాడ కనిపించని పరిస్థితి. గత ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ అమలు చేసిన నాడు–నేడు, విద్యా కానుక, అమ్మఒడి, గోరుముద్ద, ఇంగ్లీష్ మీడియం, ట్యాబుల పంపిణీ, సీబీఎస్‌ఈ పాఠశాలలు, పలు విప్లవాత్మకమైన మార్పులకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆకర్షితులయ్యారు. గత ఐదు సంవత్సరాల్లో తొలిరోజు జిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాల చూసినా అడ్మిషన్లతో కిటకిటలాడేది. కొన్ని పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డులు సైతం పెట్టారు. ప్రస్తుతం కూటమి పాలనలో సర్కారు బడుల్లో విద్యాభివృద్ధిపై చూపుతున్న అలసత్వ వైఖరికి తొలిరోజు అడ్మిషన్లు లేక బడులు వెలవెలబోయాయి.

కనిపించని బడిబాట

సర్కారు బడుల్లో అడ్మిషన్లు పెంచుకునేందుకు ఏటా వేసవి సెలవుల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించేవారు. అయితే ప్రస్తుత కూటమి పాలనలో ఎలాంటి బడిబాట కార్యక్రమం నిర్వహించని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పట్టింపు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది.

కనిపించని ఉపాధ్యాయులు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేసవి సెలవుల్లోపే పూర్తి చేసేవారు. తద్వారా పాఠశాలల పునఃప్రారంభం నాటికే ఉపాధ్యాయులందరూ పాఠశాలల్లో కనిపించేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బదిలీల ప్రక్రియ నేటికీ నత్తనడకన కొనసాగుతుండడంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కనిపించని దుస్థితి నెలకొంది.



ఎంజీఎం పాఠశాలలో తెరుచుకోని తరగతి గదులు

నాడు విద్యా పురోగతి

గత వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. పాడుబడిన పాఠశాలల భవనాలు నాడు–నేడుతో రూపురేఖలు దిద్దుకున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా వసతులు తీర్చిదిద్దారు. 2019లో జగనన్న సీఎం అయ్యాక విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్‌బుక్స్, డిక్షనరీ, స్కూలు బ్యాగులు, యూనిఫాం, షూ, సాక్సులు, బెల్టు, టైలను స్కూలు తెరిచే మొదటి రోజే వాటిని పిల్లలకు అందించేవారు. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారు. ఐఎఫ్‌పీ ప్యానల్, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ విద్యాబోధన అందించారు. బైజూస్ కంటెంట్‌తో దాదాపు రూ.32 వేలు విలువైన శాంసంగ్ ట్యాబ్‌లను ఉచితంగా అందించి విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేశారు.

నేడు తిరోగమనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలు తిరోగమనం వైపు పయనిస్తూ గత టీడీపీ పాలనను గుర్తుకు తెస్తున్నాయి. మలివిడత నాడు–నేడుకు సరైన నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళిలా మారాయి. ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఆశ సన్నగిల్లింది. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలు బాటపట్టారు.

సమస్యల తోరణం

జిల్లా వ్యాప్తంగా తొలిరోజు ఆహ్లాదకరంగా, మెరుగైన వసతులతో ఉండాల్సిన సర్కారు బడులు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలికాయి. గత ఐదేళ్ల పాటు అధునాతన హంగులతో వెలుగు వెలిగిన సర్కారు బడులు ప్రస్తుతం దీన స్థితికి చేరుకున్నాయి. వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో ఏటా తొలిరోజు సర్కారు బడులు కళకళ లాడుతూ విద్యార్థులు కనిపించేవారు. ప్రస్తుతం తొలిరోజు జిల్లా వ్యాప్తంగా గత పరిస్థితులేవీ కనిపించని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఫౌండేషన్ పాఠశాలలు 1054, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు301, మోడ్రన్ ప్రైమరీ పాఠశాలలు 613, ప్రాథమికోన్నత పాఠశాలలు 8, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ 262, మొత్తం 2,238 పాఠశాలల్లో 1,42,356 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

అరకొరగా విద్యార్థి మిత్ర కిట్లు

పాఠశాలలు తెరిచే తొలి రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేస్తామని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రగల్భాలు తొలి రోజే తుస్సుమన్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో పూర్తి స్థాయిలో విద్యార్థి మిత్ర కిట్లను అందజేయని పరిస్థితి. ఈ కిట్‌లలో విద్యార్థులకు బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, షూస్, డిక్షనరీ, వర్క్ పుస్తకాలు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇందులో షూలు, యూనిఫాంలు పూర్తి స్థాయిలో అందలేదు.










చిరిగిన చొక్కాలు, బ్యాగులు, షూస్‌తో ఎంజీఎం పాఠశాల విద్యార్థులు

కార్పొరేట్ దోపిడీ

ప్రైవేటు, కార్పొరేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సీట్ల పేరుతో విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. కౌన్సెలింగ్ ప్రక్రియ జరగముందే అడ్డగోలుగా సీట్లను భర్తీ చేసేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. మరోవైపు ప్లేస్‌మెంట్ల పేరుతో తల్లిదండ్రులను వంచించి ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు రూ.కోట్లు దండుకుంటున్నాయి. ఎంసెట్‌లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను వల వేసి పట్టుకొని మాయమాటలు చెప్పి ప్రవేశాల ఊబిలోకి దించుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఈ ఏడాది ఫీజులు అమాంతం పెంచేసి పేద విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డివిరుస్తున్నారు. ఈ అక్రమ తతంగం ఇంత పెద్ద స్థాయిలో నడుస్తున్నా ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తున్నాయి.



తిరుపతి జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల వివరాలు

ప్రభుత్వ కళాశాలలు	ప్రైవేటు కళాశాలలు
2	11
అటానమస్ కళాశాలలు	**డీమ్డ్ వర్సిటీలు**
5	2
మొత్తం సీట్ల సంఖ్య	
34,755	

- ఇంజినీరింగ్ అడ్మిషన్లతో కళకళలాడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు
- కౌన్సెలింగ్ ప్రారంభ కాకముందే ప్రవేశాలు
- అడ్వాన్సుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్షల్లో వసూలు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన.. విద్యార్థి సంఘాల ఆగ్రహం

తిరుపతి సిటీ : నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. కార్పొరేట్, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు కళకళలాడుతున్నాయి. పేద, గ్రామీణ విద్యార్థుల తల్లిదండ్రులను టార్గెట్ చేస్తూ అడ్వాన్సుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. లక్షలు వసూలు చేస్తున్నారు. ఏపీ ఈఏఎంసెట్–25 పరీక్ష ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. కౌన్సెలింగ్ ప్రక్రియకు తేదీలను ప్రభుత్వం ప్రకటించకముందే కార్పొరేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ల కోలాహలం మొదలైంది. ఎంసెట్‌లో సరైన మార్కులు సాధించని విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల వెంట పడుతున్నారు. ఇదే అదునుగా కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ తమ కళాశాలలో పేరొందిన అంతర్జాతీయ కంపెనీలు లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయని నమ్మబలుకుతూ వల వేస్తున్నారు. తల్లిదండ్రులు కళాశాల భవనాలను చూసి మురిసిపోయి చేతిలో చిల్లిగవ్వ లేకున్నా అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి యాజమాన్యాలు చెప్పినంత సొమ్ము చెల్లించుకుంటున్నారు.

కౌన్సెలింగ్ ప్రారంభం కాకముందే ప్రవేశాలు

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు నిబంధనలను బేఖాతర్ చేస్తూ ఏపీఈఏఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం కాకముందే సీట్ల భర్తీ ప్రక్రియను సాగిస్తున్నాయి. ఈ విషయం రాష్ట్ర సాంకేతిక విద్యామండలి దృష్టికి వచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు. అటానమస్ కళాశాలలు మరొక అడుగు ముందుకు వేసి తమ కళాశాలలు చేరిన ప్రతి విద్యార్థికి ప్లేస్ మెంట్ పక్కా అంటూ ఎర వేసి తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు గుంజుతున్నారు. గత ఏడాది కంటే ఈసారి ఇంజినీరింగ్‌లో డిమాండ్ అధికంగా గల కోర్సులకు కార్పొరేట్ సంస్థలు అమాంతం ఫీజుల పెంచి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి.

ముమ్మరంగా సీట్ల బేరాలు

తిరుపతి జిల్లాలోని అన్ని ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ సీట్ల విక్రయాల దందా శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే కొన్ని పేరొందిన కళాశాలలో సీఎస్‌ఈ జనరల్, ఏఐ, మిషన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఈసీఈ వంటి కోర్సులకు సీట్లు భర్తీ చేసేశారు. మరికొన్ని కళాశాలల్లో సీట్ల రిజర్వేషన్ పేరుతో లక్షల రూపాయలు ముందుగా చెల్లించి రిజర్వ్ చేసుకుంటున్నారు. తిరుపతి జిల్లాలోని సుమారు 11 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో స్థాయిని బట్టి ఫీజులు నిర్ణయించేశారు. సీఎస్‌ఈ వంటి గ్రూప్‌లకు ఏడాదికి పేమెంట్ సీటు పేరుతో లక్షల్లో ఏక మొత్తంగా చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. సీట్ల రిజర్వేషన్ కోసం చెల్లించిన నగదుకు ఎటువంటి రసీదు ఇవ్వకుండా అలాంటివి అవసరం లేదు.కంప్యూటర్‌లో అన్ని ఫీడ్ చేస్తామంటూ మాయమాటలు చెప్పడం గమనార్హం.

ఆకాశనంటుతున్న ఫీజులు



మా అబ్బాయికి ఎంసెట్‌లో 50 వేలకు పైగా ర్యాంక్ వచ్చింది. కన్వీనర్ కోటాలో సీటు వచ్చే పరిస్థితి లేదు. పేమెంట్ సీటు కోసం జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలో విచారించాం. ఏఐ బ్రాంచ్ కోసం విచారించగా ఏడాదికి రూ. 3 లక్షల ఫీజు అడుగుతున్నారు. మా భర్త చిరు ఉద్యోగి. ప్రైవేటు సంస్థలో పనిచేస్తాడు. ఏమి చేయాలో పాలుపోలేదు.

–భువనేశ్వరి, విద్యార్థి తల్లి, తిరుపతి

సీట్లు భర్తీ అయిపోయాయి



ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే సీట్లు భర్తీ అయిపోయాయి. లక్షలు అడ్వాన్స్‌లు కట్టించుకుని సీట్లు రిజర్వ్ చేసుకుంటున్నారు. మా అమ్మాయికి ఎంసెట్‌లో ఆశించిన ర్యాంకు రాకపోవడంతో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ బ్రాంచ్ కోసం విచారిస్తే రూ. లక్షలు చెల్లించాలని చెబుతున్నారు. దీంతో బీఎస్సీలో చేర్పించాలని అనుకుంటున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ప్రైవేటు ఉద్యోగి, శ్రీకాళహస్తి

విమాన ప్రమాద మృతులకు నివాళి



విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి కలగాలంటూ కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, పార్టీ శ్రేణులు

- మాజీ సీఎంతో పాటు విదేశీయులు ప్రాణాలు కోల్పోవడం కలిచివేసింది
- నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విమానశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- తిరుపతిలో కొవ్వొత్తులతో పార్టీ శ్రేణులతో కలిసి భూమన నివాళి

తిరుపతి మంగళం : అహ్మదాబాద్ విమాన ప్రమాదంలోని మృతుల ఆత్మకు శాంతి కలగాలంటూ గురువారం రాత్రి తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషతో పాటు పార్టీ శ్రేణులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. ఇంత పెద్ద విమాన ప్రమాదం ప్రపంచాన్నే కలిచివేసిందన్నారు. ఈ విమాన ఘోర ప్రమాదానికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహనరావు రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ఇంతకన్నా తక్కువ పరిస్థితులు వచ్చినప్పుడు అప్పటి ముఖ్యమంత్రులు, మంత్రులు రాజీనామాలు చేశారని గుర్తు చేశారు. విమానయాన ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక సాయం చేయాలని ప్రధానమంత్రిని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

విమాన ప్రమాదంపై దిగ్భ్రాంతి



మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై మాజీ మంత్రి ఆర్కే రోజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదంలో పలువురు మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. విమాన ప్రమాదం కారణంగా కలెక్టరేట్ వద్ద శుక్రవారం జరగాల్సిన నిరుద్యోగభృతి, ఫీజు పోరు నిరసన కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



లోకయ్య (ఫైల్)

కేవీబీపురం : అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేవీబీ పురం మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎగువపూడి గ్రామానికి చెందిన కారూరు లోకయ్య (36) కుటుంబ పోషణ కోసం హోం లోన్‌తో పాటు స్థానిక వడ్డీ వ్యాపారుల వద్ద రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. తిరిగి కొంత మేరకు చెల్లించినప్పటికీ రుణ దాతల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో వారం కిందట పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆలయ ధ్వంసంపై నిరసన

కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు ఫిర్యాదు



డీఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శ్రీఆదివారాహి అమ్మవారి ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం హిందూ చైతన్య వేదిక, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, సనాతన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శ్రీవారాహి అమ్మవారి ఆలయ నిర్వాహకులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. అనంతరం డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. తిరుచానూరు శ్రీవారాహి అమ్మవారి ఆలయాన్ని నేలమట్టం చేసిన వారిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి నేతలు హిందువుల మనోభావాలతో చెలగాటమాడుతుంటే స్థానిక అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీవారాహి అమ్మవారి ఆలయాన్ని ధ్వంసం చేయడంతో పాటు మూలవిరాట్టు చేతులు నరికి పైశాచికంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాలు హిందూ సంఘాల నేతలు కుమార స్వామి, పెరుగు, వెంకటేష్, చీనేపల్లి కిరణ్ కుమార్, సురేష్ నాయక్, విష్ణు, రాజీవ్ రెడ్డి, వారాహి అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

కోతలు.. సుఖీభవ

- ఈనెల 20లోపు ఈకేవైసీ చేసుకోవాలి
- చేయించకపోతే సుఖీభవకు అనర్హులు
- అన్నదాతకు మరో ఆందోళన
- వారం రోజులే గడువు ..1,45,360 మంది రైతులే అర్హులు
- గత వైఎస్సార్‌సీపీలో 180,763 మందికి రైతు భరోసా
- 55 వేల మందికి రైతులకు అన్నదాత సుఖీభవ కట్



నారాయణవనం : ఏఓలతో కలిసి అన్నదాత సుఖీభవ జాబితాను పరిశీలిస్తున్న డీఏవో ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్ : కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నివర్గాలను టెన్షన్‌కు గురి చేస్తోంది. తక్కువ గడువు ఇవ్వడం.. ఎక్కువ పని చేయాల్సి ఉండడంతో అందరికీ ఆందోళన తప్పడం లేదు. కౌలు రైతులకు కార్డులు ఇవ్వడం, రేషన్‌కార్డుల సభ్యులు ఈకేవైసీ చేయించుకోవడం, వితంతు పింఛన్ల విషయం, డీఎస్సీ పరీక్షలకు తక్కువ సమయం ఇవ్వడం ఇలా అన్ని అంశాల్లో తక్కువ గడువు ఇచ్చి టెన్షన్‌కు గురి చేస్తోంది.

సుఖీభవకు 1,45,360 అర్హులు

అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి రూ.20 వేలు చొప్పున రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రకటించారు. అయితే ఏడాది గడిచింది. ఇప్పటి వరకు అమలు కాలేదు. తాజాగా గురువారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 1,45,360 మంది అర్హులుగా పేర్కొన్నారు. అర్హుల జాబితాను రైతుల పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద నోటీస్ బోర్డులో పేర్లు ఉంచామని చెప్పారు. అర్హులైన రైతులు ఈనెల 20 తేదీ లోపు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీతో పాటు వేలిముద్ర వేయాల్సి ఉందని స్పష్టం చేశారు. 20 లోపు ఈకేవైసీ చేయించుకోకుంటే సుఖీభవ పథకానికి అనర్హులు అవుతారని వివరించారు.

55 వేల మందికి కష్టమే..

తాజా లెక్కల ప్రకారం పలువురు పెద్ద రైతు కుటుంబాలకు చెందిన అన్నదమ్ములు విడిపోయిన నేపథ్యంలో జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 2 లక్షల మందికి పైగా రైతులు అర్హులుగా ఉన్నట్లు తెలుస్తోంది.. అయితే కూటమి సర్కార్ 1,45,360 మంది రైతులు అర్హులుగా గుర్తించినట్లు చెబుతున్నారు. రైతు సేవా కేంద్రంలోకి వెళ్లి చూస్తే తమ పేర్లు ఉన్నాయో లేదు తెలుస్తుంది. మొత్తంగా 55 వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం రద్దు చేసినట్లు తెలుస్తోంది.

162 రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కరువు

జిల్లాలో 442 రైతు సేవా కేంద్రాలు (రైతు భరోసా కేంద్రాలు) ఉన్నాయి. ఒక్కో రైతు సేవా కేంద్రంలో ఒక్కో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉండాల్సి ఉంది. అయితే జిల్లాలో 162 రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు లేరు. వారం రోజులు గడువు ఇచ్చి 1,45,360 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాలంటే ఎలా సాధ్యం అవుతుందో తెలియడం లేదు.

వైఎస్సార్ రైతు భరోసా వివరాలు ఇలా..

2019-2024లో లబ్ధిపొందిన అన్నదాతలు

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధిపొందిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	1,55,207	119.97
2020-21	1,79,030	134.81
2021-22	1,81,711	136.55
2022-23	1,76,435	134.73
2023-24	180,763	137.01

ఐదేళ్లలో 8,73,146 మంది రైతులకు రూ.663.07 కోట్లు

ఎక్కడ భూములు ఉంటే అక్కడే ఈకేవైసీ

ఎక్కడ రైతుకు భూములు ఉంటే ఆ పరిధిలోని రైతు సేవా కేంద్రంలోని ఈకేవైసీ చేయించుకోవాలని కొత్త నిబంధన పెట్టారు. చిన్నమారు మూల గ్రామంలో కొద్దిపాటి భూమి ఉన్న ఓ రైతు బతుకు కోసం హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లిన వారు ఎంతో మంది ఉన్నారు. వీరంతా తమ సొంత గ్రామాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలంటే సులభం కాదు. అంతా ఆన్‌లైన్ అంటున్న సీఎం చంద్రబాబు ఎక్కడ ఉండే రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేసుకునే వెసులుబాటు కల్పిస్తే వారికి సమస్యలు ఉండేవి కావంటూ పలువురు రైతులు వాపోతున్నారు. ఏడాది సమయంలో మూడు విడతలుగా రూ.20 వేలు ఇస్తామని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. పథకం అమలు వరకు ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



మాట్లాడుతున్న సర్పంచ్ దామినేటి కేశవులు

తిరుపతి కల్చరల్ : తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 529/4ఏలో వున్న 98 సెంట్ల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సర్పంచ్ దామినేటి కేశవులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆయన గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పేరూరు గ్రామానికి చెందిన కొంతమంది సదురు భూమి గతంలో తమకు రిజిస్ట్రేషన్ అయిందని చెబుతూ దగా చేస్తున్నారని ఆరోపించారు. ఐదు అడుగుల గుంతలమయంగానున్న ఆ భూమిలో రాత్రికి రాత్రే 300 ట్రక్కుల ద్వారా మట్టితో పూడ్చి చదును చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. దీన్ని గ్రామస్తులు అడ్డుకున్నారని తెలిపారు. ఆ సంఘటనను అక్రమార్కులు వక్రీకరిస్తూ మాధవీలత వైఎస్సార్ సీపీ నేతలు భూకబ్జాకు పాల్పడుతున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వారి ఆరోపణలు పూర్తిగా అవాస్తమన్నారు. ప్రస్తుతం ఈ భూమి రికార్డులు పరిశీలించినా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్టు స్పష్టం చేశారు. దీని విలువ సుమారు రూ.20 కోట్లు ఉంటుందని తెలిపారు. భూకబ్జాపై రెవెన్యూ అధికారి మోహన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో మోహన్ ఆచారి, ఎంపీటీసీ ప్రసాద్, సిద్ధయ్య, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా సనాతన ధర్మం?

- కూటమి నేతల అండతోనే ఆలయాల కూల్చివేత, విగ్రహాల ధ్వంసం
- పవన్ కల్యాణ్ స్పందించరా?
- శ్రీఆదివారాహి అమ్మవారి ఆలయం ధ్వంసమైన ప్రాంతాన్ని పరిశీలించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



కూటమి నేతల దాడిలో ధ్వంసమైన ఉత్సవ విగ్రహాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



కూటమి నేతల దాడిలో గాయపడిన సిబ్బందికి హర్షిత్‌రెడ్డి పరామర్శ

సాక్షి, టాస్క్ ఫోర్స్ : 'కూటమి ప్రభుత్వంలో మనుషులకే కాదు.. దేవాలయాలకు రక్షణ లేకుండా పోయింది.. అమ్మవారి విగ్రహానికి కాళ్లు, చేతులు నరకడం సనాతన ధర్మమా..? హిందువుల మనోభావాలను కూటమి సర్కారు దెబ్బతీస్తోంది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆలయాన్ని ధ్వంసం చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుచానూరు సమీపంలోని శ్రీ ఆది వారాహి అమ్మవారి ఆలయాన్ని కూల్చివేసిన శిథిలాలను గురువారం ఆయన పార్టీ నాయకులు, హిందూ సంఘాలతో కలసి పరిశీలించారు. ఆలయం ధ్వంసం చేయడంతో పాటు విగ్రహాలను, శిథిలాలను కాలువలో పడేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతల దాడుల్లో గాయపడిన సిబ్బందిని పరామర్శించారు. అనంతరం అమ్మవారి ఆలయ ఉపచారకులు శ్రీ మహారుద్ర వారాహి స్వామివారిని ఓదార్చారు. అనంతరం కూటమి నేతలు చేసిన దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణం

శ్రీ ఆదివారాహి అమ్మవారి ఆలయాన్ని ఇసుక, మట్టి మాఫియా ముఠాలు నేలమట్టడం చేయడం దారుణమైన ఘటన అని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మండిపడ్డారు. శిథిలాలను ఒక మురుగు కుంటలో పడేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దారుణమైన ఘటన జరిగినప్పటికీ పవన్ కల్యాణ్ స్పందించకపోవడం వెనుక ఏ కుట్ర దాగుందని ఆయన ప్రశ్నించారు.

ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే అరాచకాలు

టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రోత్సాహంతోనే టీడీపీ నాయకులు ఇసుక, మట్టి మాఫియాకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆలయాన్ని నేలమట్టం చేసిన వారిని ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేయలేదంటే దాని వెనుక కూటమి నాయకుల హస్తం లేదంటారా అని మండిపడ్డారు.

తెలుగు గంగ కాలువలో యువకుడి గల్లంతు



పెరిమిడి మురళి (ఫైల్)

తొట్టంబేడు : శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామానికి చెందిన బాలాజీ రెండో కుమారుడు పెరిమిడి మురళి (19) గురువారం తెలుగు గంగ కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చుక్కల నిడిగట్లు గ్రామం నుంచి ధనూష్, ప్రశాంత్, మురళి అనే ముగ్గురు తమ స్నేహితులను కలవడానికి తొట్టంబేడుకు బయలుదేరారు. మార్గం మధ్యలో తెలుగుగంగ కాలువలో స్నానం చేస్తుండగా పెరిమిడి మురళి కొట్టుకుపోయాడని.. ఎంత వెతికినా కనపడలేదని ధనూష్, ప్రశాంత్ ఇంటికి వచ్చి తెలిపారు. లక్ష్మీపురం వద్ద ఆచూకీ లభిస్తుందని రాత్రి వేళ కూడా కుటుంబ సభ్యులు కాలువ వద్ద వెతుకుతున్నారు. పెరిమిడి మురళి కాకినాడ ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా ప్రశాంత్ ఇంటికి వచ్చి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. దీనిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. పలు అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ : వ్యక్తి మృతి



సంఘటన స్థలంలోనే మృతి చెందిన సుబ్రమణ్యం

పాకాల : ట్రాక్టర్, బైక్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్లగుట్టపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండల పరిధిలోని దామలచెరువు గుండ్లగుట్టపల్లి మధ్యలో ఉన్న భూమికట్ట వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పుల్లావాండ్లపల్లికి చెందిన చొప్పా సుబ్రమణ్యం(52) బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుదర్శన్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దౌర్జన్యంగా భూఆక్రమణ

- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



స్వామి పేరుతో సురేంద్రబాబు మద్యం తాగిన ఫొటోలు చూపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్ : తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు స్వామి పేరుతో ప్రయత్నిస్తున్న సురేంద్రబాబుపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని తిరుచానూరు గ్రామానికి చెందిన వై.నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. తమకు పిత్రార్జితంగా సంక్రమించిన భూమిని తన సోదరుడితో సన్నిహితంగా ఉంటూ భూమి కౌలుకు కావాలని మాయమాటలు చెప్పి తీసుకొని ఆ భూమిలో గుడిసె వేసి అందులో వారాహి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి తమ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. 1966లో తన తండ్రి గంగిరెడ్డిపై మాసి సంఖ్య 464లో 16 ఎకరాలకు సంబంధించి భూమి రిజిస్టర్ అయిందని తెలిపారు. అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తాము తొలగించడంతో పాటు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అంతేకాక తమకు రాజకీయాలు ఆపాదిస్తూ తమ భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దొంగస్వామి అయిన సురేంద్రబాబుపై నుంచి తమకు రక్షణ కల్పించి తమ భూమిని తమకు స్వాధీనం చేయించాలని కోరారు. సమావేశంలో వై.రమేష్‌రెడ్డి, వై.మహేష్, హేమాద్రి పాల్గొన్నారు.

కార్యదర్శుల బది'లీలలు'

- గ్రేడ్-1 కార్యదర్శులను గ్రేడ్-2గా బదిలీలు

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా పలు విభాగాలకు చెందిన అధికారులు వివిధ ప్రాంతాలకు బదిలీలు అయ్యారు. ఈనెల 9వతేదీకి బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఒక్కో విభాగానికి సంబంధించి బదిలీల వివరాలు ఆయా జిల్లా అధికారులు ఒక్కో రోజు వెల్లడిస్తున్నారు. తాజాగా గురువారం పంచాయతీ కార్యదర్శుల బదిలీల జాబితా విడదల చేశారు. జిల్లాలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 వరకు 279 మంది బదిలీ అయ్యారు. కూటమి నేతల సిఫార్సులకే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. సర్కార్ రూల్స్‌ను పక్కనపెట్టి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిని, గ్రేడ్-2గాను, గ్రేడ్-2 కార్యదర్శిని గ్రేడ్-3గా బదిలీ చేయడంపై జిల్లాలో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. ఈ అంశంపై పలువురు ఉన్నతాధికారులతో మాట్లాడితే మరోసారి పరిశీలించి సవరిస్తామని చెబుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే తమపై కక్ష సాధింపులకు దిగుతారని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కొందరు న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని భావిస్తున్నట్లు సమాచారం.

సీఎల్ఎన్ పల్లెలో చోరీ

12 సవర్ల బంగారం అపహరణ

వరదయ్యపాళెం : మండలంలోని సీఎల్ఎన్ పల్లెలో గురువారం ఉదయం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధిత కుటుంబికులు పోలీసుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీఎల్ఎన్ పల్లె గ్రామానికి చెందిన మునికృష్ణయ్య ఊరికి వెళ్లారు. ఆయన సతీమణి సమీపంలోని పొలాల వద్దకు పశువులను మేతకు తీసుకెళ్లింది. తిరిగి ఉదయం 10 గంటల 30 నిమిషాల సమయంలో ఇంటికి రాగా తాళం వేసిన ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఇంటి లోపల బీరువా తెరిచి ఉండగా అందులో ఉన్న 12 సవర్ల బంగారంను దోచుకెళ్లినట్లు బాధితులు మునికృష్ణయ్య దంపతులు వాపోయారు. దీనిపై ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల: తిరుమల శ్రీవారి ప్రాణదానం ట్రస్టుకు గురువారం తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పోతిరెడ్డి లోకేష్ రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. ఆయన డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

బలవంతపు బదిలీలు..!

- రోజుకొక వింత ధోరణి వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని వైనం
- గురువారం మూడు గంటలకు పైగా ఆగిన కౌన్సిలింగ్ ప్రక్రియ
- కౌన్సెలింగ్ కేంద్రంలో ధర్నా చేసిన బాధిత ఎస్జీటీ టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు నుంచి ఏదో ఒక వివాదం కొనసాగుతూనే ఉంది. కౌన్సిలింగ్ ప్రక్రియ ఆపడం.. కొనసాగించడం చేస్తున్నారు. తాజాగా ఈ నెల 12వ తేదీన స్పౌజ్ కోటా విషయంలో అన్యాయం జరుగుతోందని బాధిత ఎస్జీటీ టీచర్లు గురువారం కౌన్సిలింగ్‌ను బహిష్కరించారు. కౌన్సిలింగ్ కేంద్రం వద్ద ధర్నా చేశారు. స్పౌజ్ విషయంలో జీవో 22కు వ్యతిరేకంగా విద్యాశాఖ అధికారులు బదిలీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో మధ్యాహ్నం మూడు గంటలకు పైగా కౌన్సిలింగ్‌ను ఆపేసారు. టీచర్ల ధోరణితో విస్తుపోయిన డీఈవో వరలక్ష్మి ఆగ్రహంతో కౌన్సిలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఆర్‌వో మోహన్‌కుమార్, పోలీసులు కౌన్సిలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని బాధిత టీచర్లతో చర్చలు జరిపారు.

ఇచ్చిన మాట ప్రకారం మాన్యువల్ విధానంలో ఎస్జీటీల బదిలీలు నిర్వహించాలని అయ్యోర్లు ఇటీవల రోడ్డెక్కి ధర్నాలు చేసిన విషయం తెలిసిందే. దీంతో అసలు బండారం బయటపడుతుందని భావించిన కూటమి సర్కారు ఒక మెట్టు దిగింది. మాన్యువల్ బదిలీలకు అంగీకారం తెలిపింది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలోని షర్మన్ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రహసనంగా మారుతోంది. అధికారులు ఏదో ఒక సమస్యను చూపి అయ్యోర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి టీడీపీని నమ్మిన పాపానికి తగిన శాస్తి జరుగుతోందని అయ్యోర్లు లోలోపలే మదనపడుతున్నారు.




కౌన్సెలింగ్ కేంద్రంలో ధర్నా చేస్తున్న బాధిత ఎస్జీటీలు.



కౌన్సెలింగ్ ను అడ్డుకునేందుకు గేటు వద్ద గుమికూడిన ఎస్జీటీలు.

స్పౌజ్ సమస్యలే అధికం

ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్జీటీల కౌన్సిలింగ్ ప్రక్రియలో స్పౌజ్ సమస్య టీచర్లను నష్టపోయేలా చేస్తోంది. సీనియారిటీ నంబర్ 703కు ప్రక్రియ వచ్చేసరికి స్పౌజ్ సమస్యతో బాధిత మహిళా టీచర్ దీపిక న్యాయం చేయాలంటూ కౌన్సిలింగ్‌ను అడ్డుకున్నారు. మరికొందరు స్పౌజ్ బాధితులు ఆమెకు మద్దతు తెలిపారు. బాధిత టీచర్ దీపిక, ఆమె భర్త ఇద్దరూ ఎస్జీటీలే. ఆమె బుచ్చినాయుడుకండ్రిగలోను, ఆమె భర్త కేవీబీపురంలో పనిచేస్తున్నారు. వారు తప్పనిసరి బదిలీల్లో ఉన్నారు. బదిలీ జీవో ప్రకారం ఆమె ఉమ్మడి చిత్తూరులో ఎక్కడైనా కోరుకునే అవకాశం ఉంది. విద్యాశాఖ అధికారులు కేవీబీపురం మండలంలోనే కోరుకోవాలంటూ ఆమెపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. దీంతో జీవో 22ను అమలు చేసి న్యాయం చేయాలని బాధిత టీచర్ పట్టుబట్టి మరికొంత మంది బాధిత టీచర్లతో ధర్నా చేపట్టింది. చివరికి డీఆర్‌వో మోహన్ కుమార్, పోలీసులు కౌన్సిలింగ్ కేంద్రంలోకి ప్రవేశించారు. బాధిత టీచర్లతో చర్చలు జరిపారు. జీవో ప్రకారం బాధిత టీచర్ దీపికకు శ్రీకాళహస్తి కోరుకునేలా అవకాశం కల్పించారు. సమస్య పరిష్కారం అయ్యాక విద్యాశాఖ అధికారులు కౌన్సిలింగ్ ప్రక్రియను కొనసాగించారు.



స్పౌజ్ పాయింట్లకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలున్న జీవో